## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్ నగర శివారులోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ మల్లికార్జున్ తెలిపారు. బొల్లికుంట, ఖమ్మం మెయిన్ రోడ్డు, మరియాపూర్, జోగయ్యపల్లి ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### సెయింట్ ఆన్స్‌లో 60వ వార్షిక వేడుకలు

కాజీపేట: పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం 60వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా పూర్వ విద్యార్థి నిఖిత భోగా (ఐఎఫ్ఎస్) హాజరుకానున్నారని పేర్కొన్నారు.

### ప్లాన్‌కు విరుద్ధంగా ఆస్పత్రి భవన నిర్మాణం

● షోకాజ్ నోటీసు జారీ

వరంగల్ అర్బన్: హనుమకొండ చౌరస్తా నుంచి పద్మాక్షి గుట్ట రోడ్డులోని బంధన్ ఆస్పత్రి భవనం నిర్మాణం ఆమోదిత ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్నందున బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. స్కిల్ట్, పెంట్ హౌజ్, సెట్ బ్యాక్‌లపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని యజమాన్యాన్ని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని సూచించారు.

### రైస్ మిల్లర్లపై చర్య తీసుకోవాలి

న్యూశాయంపేట: సీఎంఆర్‌ను ఎగ్గొట్టి రైతులు, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్య తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా లాభాలకు ప్రైవేట్ మార్కెట్లో అమ్ముకుని రూ.లక్షలు అర్జించిన రైస్ మిల్లర్లకు జిల్లా అధికారులు తిరిగి వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. మళ్లీ వారికే ధాన్యం సేకరణకు అవకాశం కల్పించడంలో మర్మం ఏమిటని ప్రశ్నించారు.

### ఎంఎస్‌డబ్ల్యూ కోర్సును క్యాంపస్‌కు తరలించాలి



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 16 ఏళ్లుగా కొనసాగుతున్న మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) కోర్సును యూనివర్సిటీ క్యాంపస్‌లోకి తరలించాలని ఆ కోర్సు విద్యార్థులు కోరారు. ఈమేరకు క్యాంపస్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు మానాల తిరుపతి, మాసాని ప్రదీప్, లావణ్య, సమత, సంతోష్, శ్యామల, అనిత, లోకేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### భగవద్గీత శ్లోకాల పోటీలు



హన్మకొండ కల్చరల్: గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ కళాశాలలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలను బుధవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్, భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ డీడీపీ జిల్లా బాధ్యులు రామిరెడ్డి కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయురాలు జోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గ్రేటర్ వరంగల్ నాయీ బ్రాహ్మణ అధ్యక్షుడిగా కస్తూరి సతీష్

వరంగల్: గ్రేటర్ వరంగల్ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కస్తూరి సతీష్ ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు కొడెపాక రాజేందర్, మేడిపల్లి దశరథం, నాగరాజు బుధవారం ప్రకటించారు. ఎల్‌బీనగర్‌లోని కాస్మో ఫంక్షన్ హాల్‌లో అడ్‌హక్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికలను మొదటిసారిగా బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా ఉన్న ఎలకంటి సతీష్ మృతి చెందడంతో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీపడ్డారు. మంగళవారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటలకు పోలింగ్ జరగగా, పోలైన 730ఓట్లలో కస్తూరి సతీష్‌కు 388, మామిడాల బాలుకు 240, మేడిపల్లి కర్ణాకర్‌కు 66ఓట్లు వచ్చినట్లు వివరించారు.

**సీపీఎం మండల కార్యదర్శిగా సాంబయ్య**

కాజీపేట: సీపీఎం కాజీపేట మండల కార్యదర్శిగా ఓరుగంటి సాంబయ్య బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల మూడో మహాసభలను పురస్కరించుకుని జరిగిన ఎన్నికల్లో సాంబయ్యను కార్యకర్తలు ఎన్నుకున్నారు. ఈ మేరకు కాజీపేటలో సాంబయ్యను పార్టీ నాయకులు అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

# బావిలోకి మిషన్ భగీరథ నీరు

● గేట్‌వాల్వ్ ఫెయిల్ కావడంతో రివర్స్ పంపింగ్
● నిధులు మంజూరైనా మరమ్మతులు చేపట్టని అధికారులు
● స్థానికులకు సరిపడా అందని తాగునీరు



మంచినీటి బావిలోకి రివర్స్ పంపింగ్ అవుతున్న మిషన్ భగీరథ నీరు



చెత్తాచెదారంతో నిండిన మంచినీటి బావి

శాయంపేట : ఇంటింటికీ శుద్ధి చేసిన నీరు అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించి మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం వలన ఆ పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. మండల కేంద్రంలో మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ మరమ్మతులు చేపట్టకపోవడంతో బీసీ కాలనీలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గల వాటర్ ట్యాంక్‌లోకి వచ్చే నీరు రివర్స్ పంపింగ్ అవుతూ మంచినీటి బావిలో వెళ్తోన్నాయని స్థానికులు తెలిపారు. మంచినీటి బావిలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, దాంతో ఆ నీరు తాగే పరిస్థితి లేదంటున్నారు. ఇదివరకు దేవుని చెరువు సమీపంలో మంచినీటి బావి తవ్వించి అక్కడి నుంచి పైప్‌లైన్ వేసి తాగునీటిని ట్యాంకుకు మళ్లించి కాలనీవాసులకు సరఫరా చేసేవారని తెలిపారు. మిషన్ భగీరథ పథకం రావడంతో భగీరథ నీటిని నేరుగా ట్యాంక్‌ల్లోకి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇది ఇలా ఉండగా దేవుని చెరువు నుంచి బీసీ కాలనీ వాటర్ ట్యాంక్ భగీరథ నీటితో నిండి ఓవర్‌ఫ్లో అవుతుండడంతో మంచినీటి బావిలోకి రివర్స్ పంపింగ్ అవుతోందని పలువురు తెలిపారు. అంతేకాంకుడా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మిషన్ భరగీథ నీటిని గ్రామంలోకి సరఫరా చేయడంతో అవి సరిపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వేసవి కాలంలో బీసీ కాలనీ వాసులకు తాగునీటి ఎద్దడిని నివారించేందుకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పైప్‌లైన్ నిర్మాణం, గేట్‌వాల్వ్ మరమ్మతులు, మంచినీటి బావి వద్ద కంచె ఏర్పాటు కోసం రూ.5 లక్షల నిధులు కేటాయించారు. అయినప్పటికీ గేట్‌వాల్వ్ మరమ్మతులు ఇప్పటి వరకు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గేట్‌వాల్వ్ మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

రూ.18,300, 6 ఫోన్లు, 3 బైక్‌లు, ఆటో స్వాధీనం



పేకాటరాయుళ్ల అరెస్టు చూపుతున్న సీఐ పులి రమేశ్

ఎల్కతుర్తి : మండలంలోని దామెర శివారు ప్రాంతంలో గల సమ్మక్క గద్దెల సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు సీఐ పులి రమేశ్ బుధవారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తొమ్మిది మంది పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ముక్కలతో పాటు ఏడుగురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టైన వారిలో భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన చిట్టంపల్లి సాయికిరణ్, ఎల్కతుర్తికి చెందిన అంబాల రాజు, ఇదే గ్రామానికి చెందిన అంబాల నిఖిల్, దామెరకు చెందిన కడారి హరీష్ తో పాటు కల్లూరి తిరుపతి (దామెర), మాటూరి కిషన్ (ఎల్కతుర్తి), కడారి అనిల్(ఎల్కతుర్తి) ఉన్నట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి పేకాట ముక్కలతో పాటు రూ.18,300 నగదు, 6 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్రవాహనాలు, ఒక్క ఆటోను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. పేకాటరాయుళ్లను చాకచక్యంతో పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఎస్సై గోదారి రాజ్‌కుమార్, సిబ్బంది వరప్రావు, బుచ్చిలింగం, తిరుపతి, రంజిత్, సుమన్ పాల్గొన్నారు.

## జీవిత పాఠాన్ని నేర్పే గ్రంథం భగవద్గీత

● బిట్స్‌లో ఘనంగా గీత జయంతి



గీత జయంతిలో పాల్గొన్న బిట్స్ ఉపాధ్యాయులు

పరకాల : జీవితమనే యుద్ధంలో జయం, అపజయం, కష్టాలు, కన్నీళ్లు, సుఖాలు, సంతోషాలు ఉంటాయని, అన్నింటిని ఓర్పు, నేర్పుతో ధైర్యంగా ఎదుర్కోవాల్సిందేనని జీవిత పాఠాన్ని నేర్పే కార్యనిర్వాహక గ్రంథం భగవద్గీత అని బిట్స్ పాఠశాల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని బిట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ యుగేందర్ అధ్యక్షతన గీత జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులు భగవద్గీతలోని 18వ అధ్యాయాలలోని కొన్ని శ్లోకాలను, వాటి భావాలతో సహా చెప్పడం పలువురిని ఆకట్టుకుంది. మనిషిలోని రాక్షస స్వభావాన్ని అంతం చేసే నిప్పు కనిక భగవద్గీత అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

● గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్



మాట్లాడుతున్న రవీందర్

పరకాల : రాష్ట్రంలోని గొర్ల కాపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని అమరధామంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి కావాల్సిన నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేశారు. రెండో విడత గొర్రెలు పంపిణీ చేయకుండా రెండేళ్ల తర్వాత డీడీలు వెనక్కి ఇవ్వడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. గొల్ల, కురుమలు ఆర్థికంగా నష్టపోతున్నా ప్రభుత్వానికి చలనం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అదే విధంగా గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. జిల్లా ఉపాధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్ బండారి నారాయణ, మండల కార్యదర్శి కుమార్, గండ్రకోటి పవన్, శ్రీకాంత్, రాజు, అజయ్, సాంబయ్య రాయుడు, రాజయ్య పాల్గొన్నారు.

### ఉద్యోగం పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఆత్మకూరు : కాకతీయ మెడికల్ కళాశాలలో టైపిస్టు ఉద్యోగం ఇప్పిస్తానని పలు దఫాలుగా డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అక్కంపేటకు చెందిన జంగం రాజశేఖర్‌కు ధర్మసాగర్ మండలం ఉనికిచర్లకు చెందిన పిట్టల శ్రీనివాస్ కొంతకాలం క్రితం పరిచయమయ్యాడు. దీంతో రాజశేఖర్‌కు కేఎంసీలో ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పాడు. కొంత ఖర్చు అవుతుందని నమ్మబలికాడు. ఈ క్రమంలో రూ.5 లక్షలకు ఒప్పందం చేసుకొని పలు దఫాలుగా ఫోన్‌పే ద్వారా రూ.2లక్షల75వేలు శ్రీనివాస్ తీసుకున్నాడు. కాగా మంగళవారం జాబ్ విషయం ప్రస్తావించగా ఏమి చేసుకుంటావో చేస్కో అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో రాజశేఖర్ పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు.

## కృత్రిమ గర్భధారణతో మేలు రకం దూడలు

● మండల పశు వైద్యాధికారి సునీల్



దూడలకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సునీల్

శాయంపేట : మూగజీవాలు ఎదకు వచ్చినప్పుడు కృత్రిమ గర్భధారణ చేయడం ద్వారా మేలు జాతి ఆడ దూడలు వృద్ధి చెందుతాయని మండల పశు వైద్యాధికారి సునీల్ అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. రైతులు గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలన్నారు. దూడలకు నట్టల నివారణ మందులను తాగించడం వలన మూగజీవాల మరణాల శాతాన్ని తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. పశువులకు గర్భాధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ నూకల ప్రకాశ్‌రెడ్డి, గోపాల మిత్రలు క్లోపు సుదర్శన్, మధుకర్, సుమన్, రైతులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### రాష్ట్రస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌కు సాత్విక్ ఎంపిక



శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థి సాత్విక్ రాష్ట్రస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేవతి తెలిపారు. వరంగల్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో జరిగిన జిల్లాస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో మూడోస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని అభినందించి జ్ఞాపికను అందించినట్లు తెలిపారు.

### ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కమలాపూర్ : మండల కేంద్రంలో జై హనుమాన్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడిపెల్లి రాజు, ఉపాధ్యక్షులుగా మౌటం అశోక్, కొండ రాజు, ప్రధాన కార్యదర్శిగా దుండ్ర రాజు, సహాయ కార్యదర్శిగా ఇనుముల చంద్రమౌళి, కోశాధికారిగా జనగాని భిక్షపతి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మౌటం చింటూ, దాసరి ధనుంజయ్, వీరకుమార్, పెరుమాండ్ల రాజు, కొయ్యడ బాబు, హాజీమియా, యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా తక్కళ్లపెల్లి సత్యనారాయణరావును ఎన్నుకున్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత



ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామంలో టాస్క్‌ఫోర్స్, ఐనవోలు పోలీసులు సంయుక్తంగా అభిరామ్ పౌల్ట్రీఫాంలో తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ. 32వేల విలువచేసే 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా పౌల్ట్రీ ఫాం ఓనర్ గౌరిశాల కరుణాకర్‌పై కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వేలేరు : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు ఎస్సై అజ్మీర సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లకు ఇసుక ట్రాక్టర్‌లు తారసపడినట్లు తెలిపారు. దీంతో అనుమతి పత్రాలు లేని కారణంగా ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి



పుష్ప(ఫైల్)

ఆత్మకూరు : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ మహిళ గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని నీరుకుళ్లలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నీరుకుళ్లకు చెందిన అర్షం పుష్ప(53) భర్త లచ్చయ్యతో కలిసి వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని వెల్లదీస్తున్నారు. ఆడపిల్లల చదువులకు, వివాహాలకు రూ.5 లక్షలు అప్పు చేశారు. అప్పులు తీర్చే విషయంలో భార్యభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మంగళవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన పుష్ప.. గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నియామకం



ఐనవోలు : అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గడ్డం రఘువంశీని నియమించినట్లు సమాఖ్య ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నియామకపత్రం అందించారు. సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించిన సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

● ఎంపీడీఓ గుండె బాబు
● ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు
● విజేతలకు బహుమతుల ప్రదానం



ఆత్మకూరు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు, అధికారులు



ఐనవోలు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్



ఎల్కతుర్తి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత



ఎల్కతుర్తి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్

కమలాపూర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి దేశం గర్వించే క్రీడాకారులుగా ఎదగాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో సీఎం కప్-2024 మండలస్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన మండల అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు దోహదపడుతాయని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలన్నారు. తొలిరోజు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించగా క్రీడాకారులతో కలిసి అధికారులు కబడ్డీ, వాలీబాల్ ఆడి ఉత్తేజ పరిచారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, సీఐ హరికృష్ణ, ఎంఈఓ రాంకిషన్‌రాజు, ఎంపీఓ రవి, ఎంజేపీ ప్రిన్సిపాల్స్ రవీందర్, సౌజన్య, కవితారెడ్డి, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా పోటీలను మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్ బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలతో గ్రామాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు దోహదపడుతాయని అన్నారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ హనుమంతరావు, అబ్బర్వార్, ప్రభుదాస్, పీడీ ప్రేమానందం, పీఈటీలు శివ, ప్రతిభరాణి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని పరకాల ఏసీపీ సతీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం సీఎం కప్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మండలస్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన జట్లకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందించారు. మండల స్పోర్ట్స్ కన్వీనర్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ రమేశ్, పీడీలు గ్రేసమ్మ, రమేశ్, రజిత, సోమయ్య పాల్గొన్నారు.

శాయంపేట : క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతీ క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలని ఎంపీడీఓ ఫణిచంద్ర అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఫిజికల్ డైరెక్టర్లు గీత, కమలాకర్, రంజిత్, కుమార్, జ్యోతి, తరంగిణి, సత్యనారాయణ, మమత, సతీష్, స్రవంతి, ధన్పాల్ విద్యార్థులకు ఖోఖో క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో శాయంపేట, పెద్దకోడెపాక, ఖోఖో క్రీడల్లో మొదటిస్థానంలో శాయంపేట, ద్వితీయస్థానంలో గట్లకానిపర్తి జట్లు నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలు అందించారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లాస్థాయి సీఎం కప్ టోర్నమెంట్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఎల్కతుర్తి : చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని జెడ్పీసీఈఓ విద్యాలత అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులు అందించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంఈఓ సత్యనారాయణ, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐనవోలు : సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించినట్లు ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఎంఈఓ ఆనందం తెలిపారు. మండల కేంద్రంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్ మండలస్థాయి పోటీలు నిర్వహించారు. కాగా స్థానిక ఎస్సై పస్తం శ్రీనివాస్ క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు.

## బీఆర్ఎస్ పోరాటంతోనే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ



మాట్లాడుతున్న నాయకులు

నయీంనగర్: కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ఏర్పాటు హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పోరాటంతోనే సాధ్యమైందని పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ అన్నారు. వినయ్‌భాస్కర్‌ను విమర్శించే అర్హత బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు లేదని పేర్కొన్నారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ.. రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో 60శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ఢిల్లీలో దీక్ష చేసి రైల్వే మంత్రికి వినయ్‌భాస్కర్ వినతిపత్రం ఇచ్చారని గుర్తుచేశారు. కాజీపేటపై రావు పద్మకు నిజమైన ప్రేమ ఉంటే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

## అయ్యప్ప స్వామికి అభిషేకాలు



అయ్యప్ప స్వామికి అభిషేకం చేస్తున్న స్వాములు

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామికి భక్తులు, మాలధారులు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, అయ్యప్ప స్వాములు కిషన్ తదితరులు పాల్గొన్నారు.